


మన భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం




శనివారం 8 ఆగస్టు 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 3

# సూర్యాపేటకు రైలు వచ్చే వరకు పోరాటం ఆగదు










## -రైల్వే సాధన సమితి ర్యాలీకి విశేష స్పందన

భానుపురి/ సూర్యాపేట టౌన్

సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించాలన్న ఆకాంక్ష విద్యార్థుల నినాదాలతో మరోసారి మార్మోగింది. రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విద్యార్థుల భారీ ర్యాలీ ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా సాగింది. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని "సూర్యాపేటకు రైల్వే లైన్ కావాలి", "ఇచ్చిన రైల్వే లైన్‌ను మార్చడం సిగ్గు.. సిగ్గు", "రైల్వే ఉద్యమానికి ప్రజలంతా మద్దతివ్వాలి", "రైల్వే కోసం స్థిరంగా పోరాడుతాం", "రైల్వే ఉద్యమం వర్ధిల్లాలి" అంటూ చేసిన నినాదాలతో పట్టణ వీధులు మార్మోగాయి. ఉదయం 10 గంటలకు సూర్యాపేటలోని ఎల్ఐసీ భవనం వద్ద ప్రముఖ విద్యావేత్త, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొల్లు మధుసూదన్‌రావు జెండా ఊపి ర్యాలీని లాంఛనంగా ప్రారంభించారు. అక్కడి నుంచి కొత్త బస్టాండ్‌కు చేరుకున్న ర్యాలీ, అనంతరం ఎంజీ రోడ్డు మీదుగా సాగి వాణిజ్య భవన్ చౌరస్తాకు చేరుకుంది. అక్కడ ర్యాలీ బహిరంగ సభగా మారింది. దారి పొడవునా విద్యార్థుల నినాదాలు, ఉత్సాహం రైల్వే సాధన ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించాయి. రైల్వే సాధన సమితి కన్వీనర్ దేగల జనార్ధన్ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ(ఎంఎల్)-మాస్‌లైన్ కార్యదర్శి శివకుమార్, సీపీఐ(ఎంఎల్)-న్యూడెమోక్రసీ కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, రైల్వే సాధన సమితి కో-కన్వీనర్లు డాక్టర్ రమేష్ చంద్ర, రాచూరి ప్రతాప్, తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మార్జున్, ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.రామ్మూర్తి, రైల్వే సాధన సమితి గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.రంగారెడ్డి, యామా ప్రభాకర్, కొత్తపల్లి రేణుక, టీఆర్పీ జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య, ప్రముఖ విద్యావేత్త తీకుళ్ల సాయిరెడ్డి, చలపతిరావు, విశ్రాంత ఉపాధ్యాయులు ఎల్లారెడ్డి తదితరులు ప్రసంగించారు. సూర్యాపేటకు రైలు రావడం ఈ ప్రాంత ప్రజల న్యాయమైన హక్కని వక్తలు స్పష్టం చేశారు. గతంలో సూర్యాపేట మీదుగా ప్రతిపాదించిన రైల్వే మార్గాన్ని దారి మళ్లించడం ఈ ప్రాంత ప్రజలను మోసగించడమేనని విమర్శించారు. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య కీలక ప్రాంతంగా ఉన్న సూర్యాపేటను ఇప్పటికీ రైల్వే లైన్‌కు దూరంగా ఉంచడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. దేశ రైల్వే అభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలకు తగిన న్యాయం జరగడం లేదని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట ప్రాంత ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖ గుర్తించి తక్షణమే రైల్వే లైన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే సాధించే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని, రాబోయే రోజుల్లో మరింత విస్తృతంగా ప్రజలను భాగస్వాములను చేస్తూ పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. రైల్వే సాధన ఉద్యమాన్ని ఏ ఒక్క రాజకీయ పార్టీకి పరిమితం చేయకుండా రాజకీయాలకు అతీతమైన ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని వక్తలు పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీల సహకారం, పౌర సమాజం క్రియాశీల భాగస్వామ్యం, విద్యార్థులు--యువత మద్దతుతో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సామాజిక నాయకులు నల్లపాటి అప్పారావు చింతలపాటి చిన్న శ్రీరాములు, న్యాయవాది అయోధ్య వెంకట్ యాదవ్, కె.మంజుల, అక్కినపల్లి రాము, సముద్రాల రాంబాబు, మారోజు కృష్ణమూర్తి, పిడిఎస్యు నాయకులు అఖిల్, సింహాద్రి,పిడిమర్తి ఉమేష్, దంతాల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు రైల్వే సాధన సమితి అభినందనలు ర్యాలీ విజయవంతానికి సహకరించిన వివిధ కళాశాలల యాజమాన్యాలకు, అధ్యాపకులకు రైల్వే సాధన సమితి కృతజ్ఞతలు తెలిపింది. ముఖ్యంగా ర్యాలీలో క్రమశిక్షణతో పాల్గొని సూర్యాపేట రైల్వే ఆకాంక్షను తమ నినాదాలతో ప్రజల్లోకి తీసుకెళ్లిన విద్యార్థులను అభినందించింది. ర్యాలీ నిర్వహణలో ఉత్సాహంగా పనిచేసిన రైల్వే సాధన సమితి సభ్యులు, ఉద్యమ మద్దతుదారులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ సమితి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది.

# కనుల పండువగా శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణ మహోత్సవం



## -54 ద్రవ్యాలతో మహాభిషేకం

భానుపురి/సూర్యాపేట కల్చరల్

శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి కళ్యాణ మహోత్సవం ఆషాడ మాసంలో ఆడికృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని విద్యానగర్ శ్రీ రామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్ప, ఆంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం 54 ద్రవ్యాలతో శాస్త్రోక్తకంగా ఆలయ అర్చకులు రెంటాల సతీష్ శర్మ, దాములూరి సతీష్ శర్మ, ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో అన్నదానం దాతలు మడిపెద్ది యాకయ్య, మహాభిషేకం దాతలు చల్ల లక్ష్మీకాంత్ శృతి దంపతులు, ఆలయం చైర్మన్ అనంతుల గణేష్ రామలింగయ్య, ఆలయ ధర్మకర్తలు అనంతుల సూర్యనారాయణ, అనంతుల దుర్గాప్రసాద్, శ్రీనివాస్, పెద్దిరెడ్డి భరత్, వాసా కృష్ణ, చెన్నూరి వెంకన్న, తెడ్ల ప్రభాకర్, అర్చకులు దుర్గాప్రసాద్, సుబ్రహ్మణ్య సేవా బృందం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వరుణ యాగం




భానుపురి/ హైదరాబాద్

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిర్ణయించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు, సిద్ధాంతులు నిర్ణయించిన ముహూర్తం మేరకు ఈ నెల 10వ తేదీన నాగార్జున సాగర్‌లో వరుణ యాగం నిర్వహించనున్నారు. నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో యాగం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేదపండితులు, నిర్ణయించిన ముహూర్తంలో యాగ క్రతువులను నిర్వహిస్తారు. కృష్ణా, గోదావరి నదులు, చెరువులు జలకళ సంతరించుకోవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలన్న సంకల్పంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో వరుణ యాగం జరుగుతుంది. యాగం అనంతరం మహత్తర పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.


# ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభను జయప్రదం చేయండి




భానుపురి/సూర్యాపేట టౌన్

సెప్టెంబర్ 8,9,10 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లో జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహా సభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎడెల్లి శ్రీకాంత్, చేపూరి కొండలు పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు సంబంధించిన గోడ పత్రికను సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ధర్మ బిక్షం భవన్ లో విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అభివృద్ధి అంటే కొద్దిమంది సంపద పెరగడం కాదని, ప్రజలందరికీ సమాన అవకాశాలు, సామా జిక న్యాయం, లౌకికత, రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథం బలపడటమే నిజమైన అభివృద్ధి అని వారు ఉద్ఘటించారు. ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన ప్రభుత్వ రంగాన్ని కాపాడడం, ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయడం, విద్య, వైద్యాన్ని హక్కులుగా అమలు చేయడం, రైతు, కార్మిక, యువజన ప్రయోజనాలను కాపాడే ప్రజా విధానాలను అవలంబించడం ప్రతి ప్రభుత్వ రాజ్యాంగ బద్ధమైన బాధ్యతన్నారు . ప్రజలు ప్రశ్నిస్తే వారిని అణచి వేయడం కాదని , వారి సమస్యలను పరిష్కరించడమే ప్రజా స్వామ్య పాలన లక్షణం అని వారు అన్నారు. కానీ నేడు దేశంలో అమలవుతున్న ఆర్థిక విధానాలు కార్పొరేట్ వ్యక్తుల సంస్థల లాభాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు . ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరచడం, శాశ్వత ఉద్యోగాలను తగ్గించి కాంట్రాక్టీకరణను పెంచడం, విద్య, వైద్యాన్ని వ్యాపారంగా మార్చడం వల్ల సామాన్య ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదగిరిగుట్ట, యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల్లో ఉపాధి, విద్య, వైద్యం, ప్రజాస్వామ్య హక్కులు, యువజన సమస్యలు వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని వారు తెలిపారు. యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# సూర్యాపేట లో వెనుకబడిన వార్డులపై దృష్టి



భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట పట్టణ అభివృద్ధే ధ్యేయం గా పనిచేస్తామని వెనుకబడిన వార్డులపై దృష్టి పెట్టి సమన్వయంతో సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. జిల్లా కేంద్రంలోని 25 వ వార్డు కౌన్సిలర్ కోడి శిరీష శివ వార్డులోని ముత్యాలమ్మ గుడి సమీపంలో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధుల ద్వారా మంజూరైన ఐదు లక్షల రూపాయల వ్యయంతో సీసీ డ్రైన్ కల్వర్టుల నిర్మాణానికి మున్సిపల్ చైర్ పర్సన్ తో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈనెల 15 లోపు నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని తెలిపారు. సమగ్ర నివేదిక ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా దారిద్య రేఖ దిగువన ఉన్న పేదలకు ఒక కోటి 5 లక్షల రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం త్వరలో శ్రీకారం చుడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, మున్సిపల్ కౌన్సిలర్లు నాగుల వాసు, గుణగంటి హేమ సతీష్, కొణతం రాజేష్ రెడ్డి, పాలగాని మాధవి కృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా కాంగ్రెస్ సేవదల్ అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, మాజీ కౌన్సిలర్ వల్దాసు దేవేందర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగెల్లి అరుణ్ కుమార్, నరేందర్ నాయుడు, పడిదల రవి, యాట వెంకన్న, ఖమ్మంపాటి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# అటవీ సంరక్షణకు పోలీస్, అటవీశాఖలు సమన్వయంతో పనిచేయాలి




భానుపురి/సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

అడవులను నాశనం చేయవద్దని, అడవులు పెరిగితేనే కరవు లాంటి తీవ్ర పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించవచ్చని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అటవీశాఖ అధికారులతో ఆయన ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అటవీ భూముల అక్రమ ఆక్రమణలను గట్టిగా నిరోధించాలని ఆదేశించారు. ఎక్కడైనా అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నా, లేదా పోడు భూములకు సంబంధించి ఎలాంటి ధర్నాలు, ఆందోళనలు జరిగే అవకాశం ఉన్నా ఫారెస్ట్ అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పోలీసుల సహకారం తీసుకుంటూ ముందుకు సాగాలన్నారు. అడవుల విషయంలో తరచూ సమస్యలు సృష్టించే వారిని ముందుగానే గుర్తించి, వారికి చట్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఉభయ శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో అడవులను రక్షించాలని పిలుపునిచ్చారు. అలాగే ఫారెస్ట్, పోలీస్ పరిధిలో నమోదైన పాత కేసులన్నింటినీ త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి దామోదర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఇన్స్పెక్టర్లు లక్ష్మీనారాయణ, మరియు ఫారెస్ట్ రేంజ్ అధికారులు ఆదిత్య, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పట్టణ అధ్యక్షులుగా బూర మల్సూర్ గౌడ్




భానుపురి/సూర్యాపేట టౌన్

బిజెపి పట్టణ అధ్యక్షులుగా బూర మల్సూర్ గౌడ్ నియమితు లయ్యాలరు. ఈమేరకు బిజెపి జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యా లయంలో శుక్రవారం నియామ కం పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట పట్టణ అభివృద్ధి కోసం నిత్యం అందుబాటులో ఉంటూ కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి ఆహర్నిశలు పాటు పడతానని తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన మాజీ శాసనసభ్యులు సంకినే వెంకటేశ్వరరావు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్, మాజీ శాసనసభ్యులు శానంపూడి సైదిరెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియం రామచంద్రయ్య, బొబ్బ భాగ్యరెడ్డి, కవితా రెడ్డి, రాష్ట్ర నాయకులు టి, మన్మథ రెడ్డి, రంగరాజు రుక్మారావు, తోటిపల్లి రవి లకు కృతజ్ఞతలు తెలిపారు.

# బుల్లెట్ రైలు సాధన పోరాటంలో విద్యార్థులు కీలక భూమిక పోషించాలి



భానుపురి/సూర్యాపేట టౌన్

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బుల్లెట్ రైలు మార్గం అలైన్‌మెంట్‌లో చేసిన మార్పులతో నేషనల్ హైవే 65 ప్రాంతానికి తీరని అన్యాయం జరుగుతుందని ఐక్య విద్యార్థి సంఘాల ప్రతినిధులు మండిపడ్డారు. సూర్యాపేటలోని సీపీఐ కార్యాలయంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సన్నాహక సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో (పి.ఎస్.యు) రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నాగరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, (పిడిఎస్ యు) జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి, జనసేవా సమితి అధ్యక్షులు తగుళ్ల జనార్ధన్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, డీఎస్ఓ జిల్లా కార్యదర్శి భాషపంగు సునీల్, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పోలోజు మహేష్ లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొదట ప్రకటించిన జాతీయ రహదారి 65 కు సమాంతరంగా బాటసింగారం, చౌటుప్పల్, నార్కెట్పల్లి నకిరేకల్, సూర్యాపేట, మునగాల కోదాడ జగ్గయ్య పేట, నందిగామ మీదుగా అమరావతి రూట్‌ను ప్రకటించారు. దీన్ని కాదని, ప్రస్తుత అలైన్‌మెంట్‌ను మార్చడం వెనుక కొందరి స్వార్థం, లాభాపేక్ష దాగి ఉన్నాయని నాయకులు ఆరోపించారు. ఆంధ్ర ప్రాంత పెత్తందార్ల ఒత్తిళ్లు, కొంతమంది పాలకుల వ్యక్తిగత ప్రయోజనాల కొరకు ఈ రూట్ మ్యాప్ ను శంషాబాద్ నుండి హాలియా మీదుగా అమరావతికి మార్చి వేశారన్నారు. ప్రజా అవసరాలను, ఆకాంక్షలను పక్కకు పెట్టి రియల్ ఎస్టేట్ లాబీలకు వారి భూముల విలువలు పెంచడానికి ఈ నిర్ణయం జరిగిందని స్పష్టం చేశారు. ప్రస్తుతం శంషాబాద్ నుండి మాల్, మర్రిగూడ, నాంపల్లి, హాలియా మీదుగా మార్గాన్ని మార్చడం వల్ల హైవే 65 ప్రాంత నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు వ్యాపార రంగాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల ప్రజలకు కానీ తెలంగాణ రాష్ట్ర వ్యాపార, పారిశ్రామిక అభివృద్ధికి కానీ ఎలాంటి ఉపయోగం లేదు. కేవలం మన భూముల గుండా ఆంధ్రకు రైలు దారి ఇవ్వడం తప్ప తెలంగాణకు ఒరిగేదేమీ లేదని విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. బుల్లెట్ రైలును పాత మార్గంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజా బాహుళ్యంలోకి వెళ్తామని, ప్రభుత్వం స్పందించకుంటే రాబోయే రోజుల్లో మరిన్ని ఆందోళనలను ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాల ఐక్య వేదిక నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## శ్రీ శాకంబరి దేవిగా కనకదుర్గ అమ్మవారి దర్శనం



భానుపురి /సూర్యాపేట కల్చరల్

ఆషాఢ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ కనకదుర్గ దేవాలయంలో శ్రీ శాకంబరి దేవిగా కనకదుర్గ మాత దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, పట్టు వస్త్రాలతో అలంకరింప జేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యు లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వినియోగదారుల మన్ననలు పొందాలి

### ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



భానుపురి /సూర్యాపేట టౌన్

వినియోగదారుల మన్ననలు పొందేలా నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీమార్ట్ పక్కన వాఫిల్ విజ్' 72వ బ్రాంచ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టపడే వాఫిల్స్, బ్రౌనీస్, పాన్‌కేక్స్, కేక్ బౌల్స్ వంటి రుచికరమైన ఆహార పదార్థాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురావడం అభినంద నీయమన్నారు. అనంతరం నిర్వాహకులు ఆసిఫ్ మాట్లాడుతూ, యువతతో పాటు కుటుంబ సభ్యుల అభిరుచులకు అనుగుణంగా వాఫిల్స్, బ్రౌనీస్, పాన్‌కేక్స్, కేక్ బౌల్స్ లాంటి పదార్థాలను తాజాగా తయారు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, స్థానిక కౌన్సిలర్ షేక్ మన్సూర్ బీ ఫారుక్, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రహీం, చింతమల రమేష్, మొరిశెట్టి లక్షాధి, గుణగంటి సతీష్, ఆలేటి మాణిక్యం, నరేందర్ నాయుడు, అబ్దుల్ సలాం, ముస్తఫా, ఆరిఫ్, అఖిల్, సోహెల్, తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10 న జరుగు జైల్ భరో ను జయప్రదం చేయండి

భానుపురి/సూర్యాపేట టౌన్



మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10వ తేదీన జరుగు జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎన్వియన్ భవన్ లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన సీపీఎం సూర్యాపేట నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ 12 ఏళ్ల మోడీ పరిపాలనలో రైతులకు కార్మికులకు తీరని నష్టం జరిగిందన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు రద్దు చేయాలని పోరాటం చేసిన సందర్భంలో రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు జరపడం లేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. శ్రమకు తగ్గ వేతనం కోసం కార్మికుల హక్కుల కోసం వారిని సంఘటితం కాకుండా ఉండటం కోసమే ఈ లేబర్ కోడులను తెచ్చిందని అన్నారు. పోరాటాల ఫలితంగా వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చి వి బి జి రామ్ జి బిల్లుగా మార్చి వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం ఒక పథకం ప్రకారం పేదలకు పని లేకుండా చేయడం కోసం ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో కోతలు విధించిందన్నారు. దేశంలో నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జెన్ జి యువత చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగిన పేపర్ లీకేజీలో యువకులు విద్యార్థులు చేసిన పోరాట ఫలితంగా మోడీ ప్రభుత్వం కేంద్ర విద్యా శాఖ మంత్రి చేత రాజీనామా చేయించిందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10వ తేదీన జరుగు జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్వహించాలి

భానుపురి/సూర్యాపేట టౌన్



సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య ట్రాఫిక్ ఎస్సై యాదవేందర్ రెడ్డి ల తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కుడకుడ, బాలాజీ నగర్, శ్రీరాం నగర్ ప్రాంతాల నుంచి వచ్చే పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చేసిన వినతిని సర్వోత్తమ్ రెడ్డి పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కొత్త బస్ స్టాండ్ వద్ద ఉన్న అడ్డా కూలీలకు కూడా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాల సమయాల్లో ట్రాఫిక్ రద్దీ, విద్యార్థుల భద్రత, ప్రజల రాకపోకలు, అడ్డా కూలీల ఉపాధి సమయాన్ని దృష్టిలో ఉంచుకుని ఉదయం 9 గంటల తర్వాత ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థను నిర్వహిస్తే అందరికీ సౌలభ్యం కలుగుతుందని ఆయన అన్నారు. అలాగే, ప్రస్తుతం కొత్త బస్ స్టాండ్ ఎదుట ఉన్న అడ్డా కూలీల స్థలాన్ని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా కుడకుడ రోడ్డు వైపున కొంత దూరానికి మార్చే అవకాశాన్ని పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు అడ్డా కూలీలకు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# సూర్యాపేటలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

**-చేనేత జెండా ఆవిష్కరించిన : అధ్యక్షులు గండూరి రమేష్.**

భానుపురి /సూర్యాపేట టౌన్



జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని సూర్యాపేట పారిశ్రామిక సహకార సంఘ భవనంలో చేనేత పతాకావిష్కరణ అధ్యక్షులు గండూరి రమేష్ నిర్వహించారు. అనంతరం చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత వృత్తికి ఎంతో చరిత్ర కలిగి ఉన్నదని అన్నారు. 1905 ఆగస్టు 07 న ఎందరో మహానుభావులు విదేశీ వస్త్రాలు వద్దు. స్వదేశీ వస్త్రాలు ముద్దు అనే నినాదంతో ఆనాడు విదేశీ వస్త్రాలను కాల్చివేశారు అని తెలిపారు. అదే స్ఫూర్తితో 110 సంవత్సరాల తర్వాత కేంద్ర ప్రభుత్వం అధికారికంగా 2015 ఆగస్టు 07న న జాతీయ చేనేత దినోత్సవం గా ప్రకటించారు అని తెలిపారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో చేనేత వృత్తి కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు . దేశానికి రైతు ఎంత ముఖ్యమో చేతితో ఎన్నో కళలు సృష్టించిన చేనేత కార్మికులు అంతే ముఖ్యమని అన్నారు. ఇద్దరిలో ఏ ఒక్కరిని విస్మరించిన ప్రభుత్వాల మనుగడకే ప్రమాదం వాటిల్లుతుందని తెలిపారు. చేనేత కార్మికుల పక్షాన ఉండి వారికి రావలసిన ప్రతి పథకం వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. నిత్యం కార్మికులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సంఘ నాయకులు సహకార సంఘం మాజీ అధ్యక్షులు కడారి బిక్షం, రిటైర్డ్ ప్రొఫెసర్ విపూరి సుదర్శన్, రిటైర్డ్ ప్రిన్సిపల్ మిర్యాల గోపాల కిషన్, కౌన్సిలర్ నాగుల వాసు, టైలర్ల అసోసియేషన్ అధ్యక్షులు దూలం నగేష్, మాజీ ఎంపీటీసీ పున్నం వెంకటేశ్వర్లు, సహకార సంఘం ఉపాధ్యక్షులు చిలివేరు నరసింహారావు లు మాట్లాడుతూ చేనేత కార్మికులు రెక్కాడితే గాని డొక్కాడని అనే చందంగా నేతన్నల పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను 100% అమలయ్యే విధంగా చూడాలని కోరారు. చేనేత కళలు కొన్ని వేల సంవత్సరాల నుండి ప్రసిద్ధిగాంచాయని తెలిపారు. చేనేత కళలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించవద్దని అన్నారు. రైతులను, చేనేత కార్మికులను విస్మరిస్తే దేశ రాష్ట్ర ,ప్రభుత్వాలకు మనుగడ కరువవుతుందని తెలిపారు. కార్మికులకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం కార్యదర్శి భీమనపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి ముశం హరి ప్రసాద్, డైరెక్టర్లు పెద్ది శ్రీనివాస్, ముశం యాదమ్మ, యలగందుల లక్ష్మయ్య , వీడం నీరజ, యలగందుల సాయికుమార్, మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షులు మిట్టకోల సతీష్ కుమార్ , సంఘ సభ్యులు యలగం యాదగిరి, పెద్ది రామచంద్రయ్య, బాల్నే మల్లయ్య, ముశం రామస్వామి, శ్రీరాముల కృష్ణమూర్తి, బడుగు లక్ష్మీనారాయణ, కటకం మురళి, జెల్లా శివాజీ, పోన్నం రమేష్, సంగిశెట్టి ఆంజనేయులు, కోట వీరయ్య, తాటి చంద్రశేఖర్, రుద్ర నారాయణ, తాటి శ్రవణ్, ముశం చిన్న సూర్యం, జెల్లా సూర్యం, ముశం రమేష్, గుండు వెంకన్న, యలగందుల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారుల భద్రతే లక్ష్యం.. సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి

భానుపురి /సూర్యాపేట టౌన్




రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి వెంట వాహనదారులకు అవగాహన కల్పించేలా, ప్రమాదాల తీవ్రతను వివరిస్తూ పలు ప్రాంతాల్లో శుక్రవారం హెచ్చరిక సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు, వాహనదారులలో చైతన్యం తెచ్చేందుకే జాతీయ రహదారిపై ఈ సైన్ బోర్డులను అమర్చాం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి. పిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరం తీవ్ర ప్రమాదకరం. తల్లిదండ్రులు ఈ విషయంలో బాధ్యతాయుతంగా ఉండాలి. ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, పెద్ద వాహనాల్లో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలి. మద్యం మత్తులో వాహనాలు తొలవద్దు, తక్కువ వేగంతో వాహనాలు నడపాలి, రోడ్డుపై ఉన్న పరిస్థితులను అంచనా వేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షితమైన ప్రయాణాన్ని కొనసాగించాలని, పోలీసు శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్ఐ కోరారు.

# స్వాతంత్ర్య దినోత్సవం ఏర్పాట్లు ఘనంగా నిర్వహించాలి

భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్




స్వాతంత్ర్య దినోత్సవం ఏర్పాట్లు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పి కే నరసింహ తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్వాతంత్ర దినోత్సవం ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగష్టు, 15 స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు జరుగు వేడుకల సందర్భంగా ముందస్తు ఏర్పాటు చేయాలని డిఆర్ఓ ఆహ్వాన పత్రికలు, స్టాల్స్ డిఆర్డిఏ పిడి, కల్చరల్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్ హెల్త్ క్యాంపు పెట్టాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు,108 వాహనం అందుబాటులో ఉంచాలని, మున్సిపాలిటీ శాఖ వారు త్రాగు నీరు, శానిటేషన్ చేయాలని ఉపన్యాస ప్రతులు సిపిఓ తయారు చేయాలని, ఫైర్ డిపార్ట్మెంట్ ఫైర్ సేఫ్టీ పరికరాలతో సిద్ధంగా ఉండాలని, నిరంతర ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఎలక్ట్రిసిటీ వాళ్ళు చూసుకోవాలని, డిఇ ఐడపిఆర్ పబ్లిక్ అడ్రస్ సిస్టం, వీడియో కవరేజీ చేయాలని, స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో తప్పనిసరిగా అధికారులు, ఉద్యోగులుపాల్గొనాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డిఆర్డిఏ పిడి సన్యాసయ్య, జడ్పీ సీఈవో శిరీష, డిపిఓ యాదగిరి, డీఈవో అశోక్ సూర్యాపేట ఆర్డిఓ వేణు మాధవ్, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేనేత దినోత్సవం



కట్టంగూర్, ఆగస్టు 7 :

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూర్ కింగ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పద్మశాలి కాలనీలో చేనేత కార్మికులను ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి శివప్రసాద్ మాట్లాడుతూ, భారతదేశ చేనేత రంగం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. చేనేత కార్మికులు తమ కష్టంతో, నైపుణ్యంతో అద్భుతమైన వస్త్రాలను తయారు చేస్తూ దేశ ప్రతిష్ఠను ప్రపంచవ్యాప్తంగా చాటుతున్నారని పేర్కొన్నారు. చేనేత పరిశ్రమ లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోందన్నారు. పర్యావరణహితమైన చేనేత వస్త్రాలను ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేసి, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అడ్వైజర్ రెడ్డిపల్లి సాగర్, ట్రెజరర్ కల్లూరి వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ పోగుల రాములు, సభ్యులు గోషిక ఉమాపతి, జెల్లా అశోక్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.